SmartPrep

# అక్టోబర్ 2019 కరెంట్ అఫైర్స్

## తెలుగులో

SmartPrep.in

# అక్టోబర్ 2019 కరెంట్ అఫైర్స్


| S No | అంశం | పేజి సంఖ్య |
|---|---|---|
| 1 | అంతర్జాతీయం | 3-6 |
| 2 | జాతీయం | 7-13 |
| 3 | రాష్ట్రీయం | 14-18 |
| 4 | ఆర్థిక రంగం | 19-19 |
| 5 | నియామకాల | 20-20 |
| 6 | అవార్డులు | 21-21 |
| 7 | వార్తలో వ్యక్తులు | 22-22 |
| 8 | వార్తల్లో ప్రదేశాలు | 23-23 |
| 9 | నివేదికలు & సర్వేలు | 24-24 |
| 10 | క్రీడలు | 24-27 |
| 11 | మరణాలు | 28-28 |
| 12 | సైన్స్ అండ్ టెక్నాలజీ | 29-32 |


SmartPrep.in

# 1.అంతర్జాతీయం

** భారత జాతీయుడు కుల్‌భూషణ్ జాదవ్ అరెస్టు, నిర్బంధం విషయంలో వియన్నా ఒప్పందంలోని నిబంధనలను పాకిస్థాన్ ఉల్లంఘించిందని అంతర్జాతీయ న్యాయస్థానం అధ్యక్షుడు అబ్దుల్‌కావి యూసఫ్ ఐక్యరాజ్య సమితి (ఐరాస) సర్వప్రతినిధి సభకు తెలిపారు. భారత నౌకాదళ మాజీ అధికారి అయిన జాదవ్‌కు గూఢచర్యం, ఉగ్రవాదం అభియోగాలపై 2017 ఏప్రిల్‌లో పాక్ సైనిక కోర్టు మరణశిక్ష విధించగా అంతర్జాతీయ న్యాయస్థానం నిలిపివేసింది.

** సిక్కు మత స్థాపకుడు గురునానక్ దేవ్ 550వ జయంతి (నవంబరు-12) నేపథ్యంలో పాకిస్థాన్ రూ.50 ముఖ విలువ గల స్మారక నాణేన్ని విడుదల చేసింది. పాకిస్థాన్ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ దీనికి సంబంధించిన చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ నుంచి పాకిస్థాన్‌లోని కర్తార్‌పూర్‌లో ఉన్న గురుద్వారాను కలిపే కర్తార్‌పూర్ నడవా నవంబరు 9న ప్రారంభం కానుంది.

** ఎన్నికలకు వెళ్లడం ద్వారా ఐరోపా సమాఖ్య నుంచి బ్రిటన్ విడిపోయే (బ్రెగ్జిట్) విషయమై ప్రజాభిప్రాయం సేకరిద్దామంటూ ప్రధాని బోరిస్ జాన్సన్ చేసిన ప్రతిపాదనకు ప్రధాన విపక్షం లేబర్ పార్టీ అంగీకరించింది. స్కాటిష్ నేషనల్ పార్టీ, లిబరల్ డెమోక్రాట్లు కూడా మద్దతు తెలపడంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. నిజానికి బోరిస్ సర్కారుకు మే, 2022 వరకూ గడువుంది. అయితే బ్రెగ్జిట్ విషయమై పార్లమెంటులో ప్రతిష్టంభన నెలకొనడంతో రాజకీయ సంక్షోభం తలెత్తింది. దీంతో జాన్సన్ మూడోసారి దిగువ సభ రద్దుకు ప్రతిపాదించారు. దీనిపై జరిగిన ఓటింగ్‌లో మొత్తం 438 మంది చట్టసభ్యులు అనుకూలంగా ఓటు వేశారు. డిసెంబరు 12న ఎన్నికలు నిర్వహించేందుకూ అంగీకారం తెలిపారు. దిగువ సభ చేసిన 'ఎన్నికల రద్దు తీర్మానం' ఎగువ సభలో ఆమోదం పొందాల్సి ఉంది.

** ప్రపంచంలోనే ఉత్తమ పనితీరు ప్రదర్శించిన సీఈవోల జాబితాలో టాప్10లో ముగ్గురు ప్రవాస భారతీయులకు స్థానం లభించింది. హార్వర్డ్ బిజినెస్ రివ్యూ (హెచ్‌బీఆర్) అనే సంస్థ ఏటా సీఈవోల పనితీరుపై జాబితా విడుదల చేస్తుంది. అందులో భాగంగానే 2019 సంవత్సరానికి పనితీరు ఆధారంగా టాప్ 100 సీఈవోల పేర్లను ప్రకటించింది. అడోబ్ కంపెనీ సీఈవో శంతను నారాయణ్ ఆరో స్థానం, మాస్టర్ కార్డ్ సీఈవో అజయ్ బంగా ఏడో స్థానం, మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల 9వ స్థానంలో నిలిచారు. అమెరికన్ టెక్నాలజీ సంస్థ ఎన్వీడియా సీఈవో జెన్‌సెన్ హువాంగ్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. యాపిల్ కంపెనీ సీఈవో టిమ్ కుక్ 62వ స్థానంలో, మరో ప్రవాస భారతీయుడైన డీబీఎస్ బ్యాంకు సీఈవో పీయూష్‌గుప్త 89 స్థానంలో ఉన్నారు. ఆర్థిక పనితీరుతోపాటు పర్యావరణ, సామాజిక, పరిపాలన(ఈఎస్‌జీ) లాంటి అంశాల ఆధారంగా ఈ రేటింగ్ ఇస్తారు.

** యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి బ్రిటన్ వైదొలగడానికి ఉద్దేశించిన బ్రెగ్జిట్ గడువును మరోసారి పొడిగించేందుకు ఈయూ కౌన్సిల్ అంగీకరించింది. తాజా గడువు 2020 జనవరి 31తో ముగుస్తుందని యూరోపియన్ యూనియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ డొనాల్డ్ టస్క్ ప్రకటించారు.

** అర్జెంటీనా అధ్యక్షుడిగా ఆల్బెర్టో ఫెర్నాండెజ్ ఎన్నికయ్యారు. ఆ దేశ రాజ్యాంగం ప్రకారం అధ్యక్ష పదవికి పోటీ పడేవారు కనీసం 45శాతం ఓట్లను సంపాదించాలి. ప్రస్తుత అధ్యక్షుడు మౌరిసియో మాక్రి 41శాతం ఓట్లను మాత్రమే పొంది పరాజయం పాలయ్యారు. 48శాతం ఓట్లు సాధించిన అల్బెర్టో ఫెర్నాండెజ్ విజయం ఖాయమైంది. డిసెంబరులో బాధ్యతలు స్వీకరించనున్న ఆయన నాలుగేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుతం అర్జెంటీనా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ప్రపంచంలో అత్యధిక ద్రవ్యోల్బణం ఉన్న దేశాల్లో అర్జెంటీనా ఒకటి. దేశంలో మూడొంతుల మంది ప్రజలు పేదరికంలో మగ్గిపోతున్నారు.

** ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) పేరిట ఉగ్రవాద సంస్థను ఏర్పాటు చేసి, వేల మంది ప్రాణాలు తీసిన కరడుగట్టిన ఉన్మాది, ప్రపంచ మోస్ట్ వాంటెడ్ అబూ బకర్ అల్ బాగ్దాదీ అమెరికా సైనిక కమాండోల ప్రత్యేక ఆపరేషన్‌లో మరణించాడు. అల్ బాగ్దాదీ చేతిలో దారుణ అత్యాచారానికి, చిత్రహింసలకు, చివరికి హత్యకు గురైన అమెరికా మానవతా కార్యకర్త 'ఖై ్లా ముల్లర్' పేరిట ఈ ఆపరేషన్ చేపట్టారు. వాయవ్య సిరియా ఇద్లిబ్ ప్రావిన్స్‌లోని బారిషా గ్రామంలోని ఒక ప్రాంగణంలో అల్ బాగ్దాదీ ఉన్నట్లు గుర్తించిన అమెరికా నిఘా వర్గాలు 'డెల్టా ఫోర్స్' కమాండోలను పంపి ఆపరేషన్‌ను ముగించాయి.

** చైనా, భారత పర్యటకులు, వాణిజ్యవేత్తలు వీసా అవసరం లేకుండా తమ దేశానికి రావచ్చని బ్రెజిల్ అధ్యక్షుడు జాయిర్ బోల్సొనారు ప్రకటించారు.

** ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఏదైనా అంటురోగం ప్రబలితే ఎదుర్కొనేందుకు సిద్ధంగా లేవని ప్రపంచ ఆరోగ్య భద్రతా సూచీ వెల్లడించింది. 195 దేశాలతో రూపొందించిన ఈ జాబితాలో మొదటిస్థానంలో నిలిచిన అమెరికాతో సహా 13 దేశాలు మాత్రమే అధిక స్కోరుతో పటిష్టంగా ఉన్నాయి. బ్రిటన్, నెదర్లాండ్స్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. భారత్‌కు 57వ స్థానం దక్కింది. ఆరోగ్య అత్యయిక పరిస్థితిని గుర్తించడం, నివారించడం, చర్యలు చేపట్టడంలో ప్రతి దేశం సామర్థ్యాన్ని ఈ సూచీ అంచనా వేసింది.

** కర్తార్‌పూర్ కారిడార్‌ను వాడుకలోకి తీసుకువచ్చేందుకు భారత్ - పాకిస్థాన్ దేశాలు చారిత్రక ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీనివల్ల భారత్‌లోని సిక్కులు పాకిస్థాన్‌లోని పవిత్ర దర్బార్ సాహిబ్‌ను నిరాటంకంగా దర్శించుకునే అవకాశం ఏర్పడింది. ఈ

నడవా మన దేశంలోని పంజాబ్‌లో ఉన్న డేరా బాబా నానక్ మందిరం నుంచి పాకిస్థాన్ కర్తార్‌పూర్‌లోని దర్బార్ సాహిబ్ మందిరానికి అనుసంధానంగా ఉంటుంది.

** నేరారోపణలు ఎదుర్కొంటున్నవారిని చైనా సహా ఇతర దేశాలకు అప్పగించేందుకు ఉద్దేశించిన బిల్లును అధికారికంగా ఉపసంహరించుకున్నట్లు హాంకాంగ్ ప్రభుత్వం ప్రకటించింది. భద్రతా కార్యదర్శి జాన్ లీ హాంకాంగ్ చట్టసభలో ఈ మేరకు ప్రకటన చేశారు. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ ఉద్యమకారులు 5 నెలలుగా పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించారు.

** కెనడాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రధానమంత్రి జస్టిన్ ట్రుడోకు చెందిన లిబరల్ పార్టీ 157 స్థానాల్లో విజయం సాధించింది. మొత్తం 338 స్థానాలకు (ఎలక్టోరల్ డిస్ట్రిక్ట్స్) ఎన్నికలు నిర్వహించారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం 170. ఈ నేపథ్యంలో 24 స్థానాలు గెలుచుకున్న భారత సంతతికి చెందిన జగ్మీత్ సింగ్ నేతృత్వంలోని న్యూ డెమొక్రటిక్ పార్టీ (ఎన్‌డీపీ) పాత్ర నిర్ణయాత్మకంగా మారింది.

** బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ బ్రెగ్జిట్ ప్రక్రియను మరో మూడు నెలలపాటు పొడిగించాలని కోరుతూ ఐరోపా సమాఖ్య (ఈయూ)కు లేఖ రాశారు. ఈయూ నుంచి బయటికి రావడానికి అక్టోబరు 31 వరకు గడువు ఉండగా దాన్ని 2020 జనవరి వరకు పొడిగించాలని ఆయన కోరారు.

** ఐరోపా సమాఖ్య (యూరోపియన్ యూనియన్ - ఈయూ) నుంచి యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) వైదొలిగే ప్రక్రియ 'బ్రెగ్జిట్'ను ఆలస్యం చేయాలని బ్రిటన్ పార్లమెంట్ తీర్మానించింది. సాధారణంగా శనివారం పార్లమెంట్ సమావేశాలు నిర్వహించరు. ఇలాంటి ప్రత్యేక సమావేశాలను సూపర్ శాటర్ డే సెషన్‌గా వ్యవహరిస్తుంటారు. బ్రెగ్జిట్ గడువును ఇప్పటికే మూడుసార్లు పొడిగించారు.

** 'ఇమ్మెక్స్ - 19' పేరుతో విశాఖపట్నంలో భారత్ - మయన్మార్ నౌకా విన్యాసాలు ప్రారంభమయ్యాయి. ఐఎన్ఎస్ రణ్‌విజయ్‌పై నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో ఇరు దేశాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

** లండన్‌లోని నాట్‌వెస్ట్ బ్యాంకులో డిపాజిట్ అయి ఉన్న నిజాం నిధులు భారత్‌కే చెందుతాయని బ్రిటన్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. నాటి హైదరాబాద్ సంస్థానాధీశుడైన 7వ నిజాంకు చెందిన సుమారు రూ.306.50 కోట్ల నిధులు (ప్రస్తుత విలువ) తమకే చెందాలన్న పాకిస్థాన్ వాదనను బ్రిటన్ హైకోర్టు తోసిపుచ్చింది. 70 సంవత్సరాలుగా నలుగుతున్న ఈ కేసులో భారత్‌కు అనుకూలంగా తీర్పు వెలువడింది. 1948లో అప్పటి హైదరాబాద్ నిజాం సుమారు 1,007,940 పౌండ్ల (ప్రస్తుత విలువ ప్రకారం సుమారు 8.82 కోట్ల పైచిలుకు) మొత్తాన్ని నాడు కొత్తగా ఏర్పడిన పాకిస్థాన్ తరఫున బ్రిటన్‌లో హైకమిషనర్‌గా పని చేస్తున్న హబీబ్ ఇబ్రహీం రహీంతుల్లా ఖాతాలోకి బదలాయించారు. నాటి నుంచీ ఆ మొత్తం బ్యాంకులోనే ఉండిపోయింది. ప్రస్తుతం దాని

విలువ సుమారు రూ.306.50 కోట్లకు చేరుకుంది. ఈ నిధులు తమకే దక్కాలంటూ 7వ నిజాం వారసులు ప్రిన్స్ ముఖర్రం జా, ఆయన సోదరుడు ముఫఖం జా, భారత ప్రభుత్వం సంయుక్తంగా కేసు వేశారు.

** చైనాలో కమ్యూనిస్ట్ పార్టీ అధికారం చేపట్టి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా (జాతీయ దినోత్సవం కూడా) సైనిక సత్తాను చాటుతూ ప్రభుత్వం బీజింగ్‌లో భారీ కవాతు నిర్వహించింది. ప్రపంచంలోనే అతి పెద్దదైన చైనా సైన్యం తన కవాతులో దీర్ఘశ్రేణి ఖండాంతర క్షిపణి డాంగ్ ఫెంగ్ (డీఎఫ్) - 41, ఎలాంటి వాతావరణంలోనైనా పని చేసే డాంగ్ ఫెంగ్ - 17 సంప్రదాయ క్షిపణులను ప్రదర్శించింది. డీఎఫ్-41 ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన క్షిపణిగా పరిగణిస్తున్నారు. ఇది 30 నిమిషాల్లోనే అమెరికాను తాకగలదని నిపుణులు చెబుతున్నారు.

** చైనా కమ్యూనిస్ట్ ప్రభుత్వ 70వ వార్షికోత్సవాన్ని హాంకాంగ్‌లోని ప్రజాస్వామ్యవాదులు 'విషాద దినం'గా ప్రకటించారు. స్వయం ప్రతిపత్తి, ఓటు హక్కు, అందరికీ ఎన్నికల్లో పోటీ చేసే హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ భారీగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

# ౭.జాతీయం

** ఒకే రాష్ట్రంగా ఉన్న జమ్మూకశ్మీర్ రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడిపోయింది. దీంతో అవిభక్త జమ్మూకశ్మీర్‌లో విధించిన రాష్ట్రపతి పాలనను ఎత్తివేశారు. ఈ మేరకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కార్యాలయం నుంచి అధికారిక నోటిఫికేషన్ జారీ వెలువడింది. 2017 జూన్‌లో అవిభక్త జమ్మూకశ్మీర్‌లో పీడీపీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వానికి భాజపా తన మద్దతు విరమించుకుంది. సరైన సంఖ్యాబలం లేకపోవడంతో అప్పటి ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ రాజీనామా చేశారు. దీంతో రాష్ట్రంలో గవర్నర్ పాలన విధించారు. ఆరు నెలల తర్వాత రాష్ట్రపతి పాలన అమల్లోకి వచ్చింది. జమ్మూకశ్మీర్ ప్రస్తుతం జమ్మూ-కశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా విడిపోయింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 ప్రకారం.. ఆ రాష్ట్రంలో విధించిన రాష్ట్రపతి పాలన కేంద్ర పాలిత ప్రాంతాలకు వర్తించదు. దీంతో దాన్ని ఎత్తివేస్తున్నట్లు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రకటించారు.

» కేంద్రంలో రెండోసారి అధికారాన్ని చేపట్టిన నరేంద్ర మోదీ ప్రభుత్వం జమ్మూ-కశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన 370 అధికరణాన్ని రద్దు చేయడంతో పాటు రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడగొట్టింది. 370 అధికరణం వల్ల జమ్మూ-కశ్మీర్‌కు స్వీయ రాజ్యాంగం ఉండేది. ఇతర రాష్ట్రాలవారు అక్కడ భూములు, ఆస్తులు కొనకూడదు. ఈ అధికరణాన్ని రద్దు చేయడం వల్ల ఈ నిబంధనలన్నీ చెల్లుబాటు కావని ప్రభుత్వం తెలిపింది. ఒక రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చడం ఇదే మొదటిసారి. ఇప్పటివరకూ ఒక కేంద్ర పాలిత ప్రాంతాన్ని రాష్ట్రంగా మార్చడం లేదా ఒక రాష్ట్రాన్ని రెండు రాష్ట్రాలుగా విడగొట్టడమే జరిగాయి. సాధారణ పరిస్థితులు నెలకొన్నాక జమ్మూ-కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని కేంద్రం పేర్కొంది. పటేల్ జయంతి రోజైన అక్టోబరు 31ని అపాయింటెడ్ డేగా జమ్మూ-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2019 పేర్కొంది.

» లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతానికి తొలి లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఆర్.కె. మాథుర్ ప్రమాణస్వీకారం చేశారు. లేహ్‌లోని తిసూరులో జరిగిన కార్యక్రమంలో జమ్మూకశ్మీర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గీతా మిత్తల్ ఆయనతో ప్రమాణం చేయించారు. కశ్మీర్ గవర్నర్‌గా గిరిశ్ చంద్ర ముర్మ కూడా ప్రమాణం చేశారు.

** సర్దార్ వల్లభాయ్ పటేల్ 144వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ఐక్యతా దివస్ వేడుకలు నిర్వహించారు. అక్టోబర్ 31ని ఐక్యతా దినోత్సవంగా మోదీ 2014లో ప్రకటించారు.

** రైతుల ఆదాయం వృద్ధి చేసే దిశగా తమిళనాడు ప్రభుత్వం రూపొందించిన చట్టానికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదం తెలిపారు. దీంతో దేశంలోనే తొలిసారిగా కాంట్రాక్టు వ్యవసాయంపై చట్టాన్ని రూపొందించి అమలు చేస్తున్న రాష్ట్రంగా తమిళనాడు నిలిచింది. రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తులు, పశుసంవర్ధక ఒప్పంద సేవా సదుపాయాల చట్టం పేరుతో ప్రభుత్వం 2019 ఫిబ్రవరిలో

అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టింది. పంట దిగుబడి అధికంగా ఉన్న సమయంలో, మార్కెట్ ధరల హెచ్చుతగ్గుల వేళ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ చట్టం ఉపయోగపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. కాంట్రాక్టు వ్యవసాయం చట్టం సక్రమంగా అమలయ్యేందుకు, పనితీరు మెరుగ్గా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేయడానికి ప్రభుత్వం తమిళనాడు రాష్ట్ర కాంట్రాక్ట్ ఫార్మింగ్ అండ్ సర్వీసెస్ అథారిటీ పేరుతో ఆరుగురు సభ్యుల సంఘాన్ని కూడా ఏర్పాటు చేసింది.

** దేశంలోని ఇతర ప్రాంతాల ప్రజలతో పోలిస్తే గంగా - సింధు మైదాన ప్రాంతాల ప్రజల జీవితకాల సగటు ఏడేళ్లు తక్కువని తాజా అధ్యయనంలో వెల్లడైంది. అక్కడ వాయు కాలుష్యం అధికంగా ఉండటమే దీనికి కారణం. యూనివర్సిటీ ఆఫ్ షికాగోకు చెందిన ఎనర్జీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ రూపొందించిన 'ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్' ప్రకారం దేశంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే ఈ ప్రాంతంలో పార్టిక్యులేట్ కాలుష్యం రెండు రెట్లు ఎక్కువగా ఉంది. 1998తో పోలిస్తే గంగా - సింధు మైదాన ప్రాంతంలో వాయు కాలుష్యం 72 శాతం పెరిగిందని తేలింది. రానున్న అయిదేళ్లలో వాయు కాలుష్యాన్ని తగ్గించే లక్ష్యంతో భారత ప్రభుత్వం 2019లో 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్'ను ప్రారంభించింది.

** దేశంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ రోగుల్లో ఆంధ్రప్రదేశ్ రెండో, తెలంగాణ అయిదో స్థానంలో నిలిచాయి. 2018 డిసెంబరు నాటికి దేశవ్యాప్తంగా 12.73 లక్షల మంది ఈ మహమ్మారితో బాధపడుతుండగా అందులో 1.82 లక్షల మంది ఆంధ్రప్రదేశ్‌లో, 78 వేల మంది తెలంగాణలో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం అక్టోబరు 30న విడుదల చేసిన జాతీయ హెల్త్ ప్రొఫైల్ నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది.

** రాష్ట్రాల విద్యాబోర్డులను పర్యవేక్షించేందుకు కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో జాతీయస్థాయి నియంత్రణ వ్యవస్థ ఏర్పాటు కానుంది. జాతీయ విద్యావిధాన (ఎన్ఈపీ) నివేదికలో ఈ మేరకు ప్రతిపాదించారు. 21వ శతాబ్దపు అవసరాల మేరకు నిపుణులను తయారు చేసే దిశగా విద్యాబోధనలో తగిన ప్రమాణాలు నెలకొల్పాలనేది దీని లక్ష్యంగా ఎన్ఈపీ తుది ముసాయిదా పేర్కొంటోంది. ఎన్ఈపీకి సంబంధించి 55 పేజీల సంక్షిప్త నివేదికను కేంద్రం సిద్ధం చేసింది. మే 31న విడుదల చేసిన ముసాయిదా నివేదిక అనంతరం ప్రజల నుంచి సూచనలు స్వీకరించారు.

** ఆంధ్రప్రదేశ్‌లో జనాభా నిష్పత్తికి అనుగుణంగా పోలీసులు లేరని కేంద్రహోంశాఖ విడుదల చేసిన తాజా నివేదిక పేర్కొంది. దీని ప్రకారం ఏపీలో ప్రతి లక్ష మందికి కేవలం 109 మంది మాత్రమే ఉన్నారు. దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపరంగా చూస్తే ఆంధ్రప్రదేశ్ 31వ స్థానంలో ఉంది. జాతీయ సగటు 192గా కాగా ఆంధ్రప్రదేశ్‌కు 145 మంది పోలీసులు అవసరం. ఒక్కో పోలీసు సగటున 915.69 కి.మీ. పరిధిలో పనిచేస్తున్నారు. రాష్ట్రంలో 11,903.68 మంది మహిళలకు ఒక

మహిళా పోలీసు ఉన్నారు. ఈ నిష్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలో తొలిస్థానంలో ఉంది. మొత్తం పోలీసు బలగాల్లో 3.81 శాతం మంది మహిళలు పనిచేస్తున్నారు. బడ్జెట్‌పరంగా పోలీసు విభాగానికి కేటాయిస్తున్న మొత్తం అంతంత మాత్రంగానే ఉంది. 2016-17లో మొత్తం రాష్ట్ర బడ్జెట్‌లో పోలీసింగ్‌కు 2.84% కేటాయించగా, 2017-18లో అది 2.68%కి తగ్గిపోయింది.

** హరియాణా ముఖ్యమంత్రిగా భాజపా నాయకుడు మనోహర్‌లాల్ ఖట్టర్ అక్టోబరు 27న ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్ర గవర్నర్ సత్యదేవ్ నారాయణ్ ఆర్య చండీగఢ్‌లోని రాజ్‌భవన్‌లో ఆయనతో ప్రమాణం చేయించారు. జన్‌నాయక్ జనతాపార్టీ అధ్యక్షుడు దుష్యంత్ చౌతాలా ఉపముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు.

** చిన్నారులపై దేశవ్యాప్తంగా నిత్యం దాదాపు 350 నేరాలు చోటు చేసుకున్నట్లు 'చైల్డ్ రైట్స్ అండ్ యూ' (క్రై) తెలిపింది. 2017 సంవత్సరంలో చిన్నారులపై జరిగిన నేరాలను వెల్లడించింది. 'నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో' (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాల ప్రకారం యూపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు చిన్నారులకు నరకప్రాయమైన ప్రదేశాలుగా పేర్కొంది. 2016లో చిన్నారులపై జరిగిన నేరాల సంఖ్య 1,06,958గా ఉండగా, 2017 నాటికి అదికాస్తా 1,29,032కి చేరినట్లు ఎన్‌సీఆర్‌బీ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం మీద 2017లో దేశవ్యాప్తంగా రోజుకు 350పైగా ఈ తరహా నేరాలు చోటుచేసుకున్నాయి. ఝార్ఖండ్‌లో ఈ తరహా నేరాలు 73.9 శాతం పెరిగినట్లు స్పష్టమవుతోంది. మణిపుర్‌లో 2016-17 సంవత్సరంలో పిల్లలపై నేరాల సంఖ్య 18.7 శాతం తగ్గింది.

** జమ్మూ - కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి గిరీశ్ చంద్ర ముర్ము (59), లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా రక్షణ శాఖ మాజీ కార్యదర్శి రాధాకృష్ణ మాథుర్ (65)లను నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబరు 31 నుంచి జమ్మూ - కశ్మీర్ రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా మారనున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం వాటికి తొలి రాజ్యాంగాధినేతలను నియమించింది. ప్రస్తుతం జమ్మూ - కశ్మీర్ రాష్ట్ర గవర్నర్‌గా ఉన్న సత్యపాల్ మాలిక్ గోవాకు బదిలీ అయ్యారు. ఆ రాష్ట్ర గవర్నర్‌గా ఉన్న మృదులా సిన్హా పదవీకాలం ఆగస్టుతోనే ముగిసింది. మిజోరం గవర్నర్‌గా పీఎస్ శ్రీధరన్ పిళ్లై నియమితులయ్యారు. ఈయన కేరళ భాజపా అధ్యక్షుడు.

** సమాచార హక్కు (సహ) చట్టంపై కొత్త నిబంధనలను కేంద్రం నోటిఫై చేసింది. దేశవ్యాప్తంగా సహ కమిషనర్ల పదవీకాలాన్ని మూడేళ్లకు తగ్గించింది. వారి జీతభత్యాలను ఇకపై ప్రభుత్వమే నిర్ణయించనుంది. సమాచార హక్కు చట్టం-2005ను కేంద్రం ఈ ఏడాది జులైలో సవరించింది. సహ నిబంధనలు - 2019 పేరిట రూపొందించిన కొత్త అంశాలు కేంద్ర, రాష్ట్రస్థాయిలోని సమాచార కమిషనర్లకు వర్తిస్తాయి.

** మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. మహారాష్ట్రలో మొత్తం 288 స్థానాలకు భాజపా కూటమికి 161 లభించగా, కాంగ్రెస్ కూటమికి 98 దక్కాయి. ఇతరులు 29 చోట్ల విజయం సాధించారు. హరియాణాలో మొత్తం 90 స్థానాల్లో భాజపా 40, కాంగ్రెస్ 31, జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) 10, ఐఎన్ఎల్‌డీ 1, ఇతరులు 8 స్థానాలు గెలుచుకున్నారు.

» తెలంగాణలోని హుజుర్‌నగర్ అసెంబ్లీ స్థానానికి నిర్వహించిన ఉప ఎన్నికలో తెరాసకు చెందిన శానంపూడి సైదిరెడ్డి విజయం సాధించారు.

** పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్‌లకు కేంద్ర ప్రభుత్వం మహారత్న హోదా ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వరుసగా మూడేళ్లు సగటున రూ.5 వేల కోట్ల నికర లాభం, సగటున రూ.15 వేల కోట్ల వార్షిక నికర సంపద, గత మూడేళ్లు సగటున రూ.25 వేల కోట్ల వార్షిక టర్నోవర్ కలిగిన సంస్థలకే ఈ హోదా కల్పిస్తారు. ఈ సంస్థలు ఇకపై మరింత స్వతంత్రంగా పని చేయడానికి వీలవుతుంది. ప్రస్తుతం మహారత్న హోదా ఉన్న సంస్థలు: ఎన్టీపీసీ, ఓఎన్‌జీసీ, సెయిల్, భెల్, ఐఓసీ, కోల్ ఇండియా, గెయిల్, బీపీసీఎల్.

** ప్రభుత్వ రంగ టెలికాం సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌లను విలీనం చేయాలని కేంద్ర మంత్రిమండలి నిర్ణయించింది. వీటి పునరుద్ధరణకు రూ.68,751 కోట్ల భారీ ప్యాకేజీని ప్రకటించింది. ఈ రెండు సంస్థల్లో 50 ఏళ్లకు పైబడిన ఉద్యోగులకు స్వచ్ఛంద పదవీ విరమణ పథకం అమలు చేయనున్నారు. దీనికి రూ.29,937 కోట్లు అవసరం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నట్లు కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ వెల్లడించారు.

** కేంద్ర పంచాయతీరాజ్ శాఖ దేశవ్యాప్తంగా 250 గ్రామపంచాయతీలకు 3 విభాగాల్లో అవార్డులు ఇచ్చింది. వీటిలో ఆంధ్రప్రదేశ్‌లో 13, తెలంగాణలో 9 పంచాయతీలు పురస్కారాలు గెలుచుకున్నాయి. గ్రామసభలను ఉత్తమంగా నిర్వహించినందుకు 'నానాజీ దేశ్‌ముఖ్ రాష్ట్రీయ గ్రామ సేవా గౌరవ పురస్కార్', సామాజిక అభివృద్ధి, పారిశుద్ధ్య రంగాల్లో సేవకు 'దీనదయాళ్ ఉపాధ్యాయ్ స్వశక్తీకరణ పురస్కార్', పిల్లల సంరక్షణకు సంబంధించి 'చైల్డ్ ఫ్రెండ్లీ' పేరుతో ఈ పురస్కారాలను ప్రకటించారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా దిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు, ప్రణాళిక అమలు అంశాలకు సంబంధించిన 'గ్రామ మానచిత్ర' యాప్‌ను ఆయన ఆవిష్కరించారు.

** దేశంలోనే అత్యంత కాలుష్యభరిత నగరంగా కాశీ నిలిచింది. గాలి నాణ్యతా సూచీ (ఏక్యూఐ) ఆధారంగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ఈ వివరాలను వెల్లడించింది. దేశంలోని 500 నగరాలకు ఏక్యూఐ ర్యాంకింగ్‌లు ప్రకటించారు. ఈ

జాబితాలోని తొలి మూడు కాలుష్యభరిత నగరాలు ఉత్తర్‌ప్రదేశ్‌లోనే ఉన్నాయి. హైదరాబాద్ 91, విశాఖపట్నం 55, విజయవాడ 36, తిరుపతి 49, అమరావతి 32 స్థానాల్లో ఉన్నాయి.

** ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన చాక్లెట్‌ను ఐటీసీ సంస్థ దిల్లీలో ఆవిష్కరించింది. దీని ధర కేజీ రూ.4.3 లక్షలు. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనవిగా గిన్నిస్‌బుక్‌లో చోటు పొందాయి.

** ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్నవారికి ఇకపై ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వకూడదని అస్సాం ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి శర్బానంద్ సోనోవాల్ నేతృత్వంలో సమావేశమైన మంత్రిమండలి కొత్త నిబంధనకు ఆమోదం తెలిపింది. ఈ నిబంధన 2021 జనవరి 1 నుంచి అమల్లోకి రానుంది.

** సామాజిక మాధ్యమాల్లోని పౌరుల సమాచారాన్ని తెలుసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందా అనే అంశంపై విచారణ జరపాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. సామాజిక మాధ్యమాలకు ఆధార్ నంబర్‌ను అనుసంధానించడంపైనా విచారణ జరపనుంది. దీనికి సంబంధించి వేర్వేరు హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను సుప్రీంకోర్టు తనకు తానుగా బదిలీ చేసుకుంది. ఈ అంశంపై జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ అనిరుద్ధ బోస్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అడ్డుకోవడం, మెసేజ్‌లను డీక్రిప్ట్ చేసే బాధ్యత ఇంటర్మీడియరీస్‌దే (ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు, సెర్చ్ ఇంజిన్లు, సామాజిక మాధ్యమాల వేదికలు) అనడంలో విశ్వసనీయతపై జనవరి 15లోగా నివేదిక సమర్పించాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంటర్మీడియరీస్ గైడ్‌లైన్స్ (సవరణ) చట్టం - 2018 రూపకల్పనకు 90 రోజుల గడువు కావాలని కేంద్రం విజ్ఞప్తి చేయగా ధర్మాసనం సానుకూలత వ్యక్తం చేసింది.

** మహారాష్ట్రలో 288, హరియాణాలో 90 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించారు. వీటితోపాటు 17 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలోని 51 శాసనసభ, రెండు లోక్‌సభ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరిగాయి.

** 2017లో దేశంలో నేరాలు 3.6% పెరిగాయని జాతీయ నేర గణాంకాల మండలి (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక వెల్లడించింది. అపహరణ కేసులు 9 శాతం పెరిగాయి. మహిళలపై భర్తలు, వారి బంధువుల క్రూరత్వానికి సంబంధించిన కేసులు 33.2% ఉన్నాయి. దేశంలో జైళ్లలో ఉన్న ఖైదీల సంఖ్య 7.4% పెరిగింది.

** కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రకటించే జాతీయ చేనేత అవార్డుకు తమిళనాడులోని కాంచీపురానికి చెందిన ఆర్. గీత ఎంపికయ్యారు. చేనేత రంగంలో ప్రతిభ చూపేవారికి 2014 నుంచి ఈ అవార్డు కింద రూ.1.50 లక్షల నగదు బహుమతిని ప్రభుత్వం అందిస్తోంది.

2017 సంవత్సరానికి దేశవ్యాప్తంగా చేనేత రంగంలో ప్రతిభ ప్రదర్శించిన 11 మందికి ఈ అవార్డు ప్రకటించారు. వారిలో గీత ఒకరు.

** కేంద్ర హోం మంత్రి అమిత్ షా కొత్త దిల్లీ స్టేషన్‌లో దిల్లీ-కాట్రా వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. ఈ రైలుతో దిల్లీ-కాట్రా మధ్య ప్రయాణ సమయం 8 గంటలకు తగ్గుతుందని మంత్రి పేర్కొన్నారు. రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

** హార్వర్డ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు, టాటా ట్రస్ట్ సహకారంతో దేశవ్యాప్తంగా 543 పార్లమెంట్ నియోజకవర్గాల్లో నిర్వహించిన అధ్యయనంలో పిల్లల్లో ఎదుగుదల లోపాలు వెలుగుచూశాయి. పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు 2018 మార్చిలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'పోషన్ అభియాన్' పథకం అమలు తీరును వీరు పరిశీలించారు.

** మహాత్ముని జయంతి సందర్భంగా దిల్లీలో రెండు గిన్నిస్ రికార్డులు నమోదయ్యాయి. దిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతానికి చెందిన విద్యార్థులు భారీసంఖ్యలో ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియానికి చేరుకుని, తొలుత పర్యావరణ మనుగడ గురించి పాఠాలు చెప్పారు. తర్వాత వారంతా ఒకేసారి సౌర విద్యుత్ బల్బులు వెలిగించి రెండో రికార్డు నెలకొల్పారు. కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటైంది.

** మహాత్మాగాంధీ 150వ జయంతిని పురస్కరించుకుని అహ్మదాబాద్‌లోని సబర్మతి తీరంలో నిర్వహించిన 'స్వచ్ఛ భారత్ దివస్' కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఆరుబయట మల విసర్జన అలవాటు నుంచి ఇప్పుడు మన దేశం బయటపడిందని మోదీ ప్రకటించారు. వాడిన తర్వాత పారవేసే ప్లాస్టిక్‌ను నిర్మూలించే లక్ష్యాన్ని 2022 నాటికి సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. గాంధీజీ స్మారకార్థం రూ.150 నాణేలను మోదీ విడుదల చేశారు.

** స్వచ్ఛ రైల్ - స్వచ్ఛ భారత్‌లో విజయవాడ రైల్వేస్టేషన్‌కు ఏడోస్థానం, హైదరాబాద్‌కు 17వ స్థానం దక్కాయి. స్వచ్ఛ భారత్ స్ఫూర్తిగా రైల్వే శాఖ శుభ్రత ఆధారంగా రైల్వే స్టేషన్లకు 2016 నుంచి ర్యాంకులు ప్రకటిస్తోంది. ఈ ఏడాది జైపూర్, జోధ్‌పూర్, దుర్గాపుర తొలి మూడుస్థానాల్లో నిలిచాయి.

** కేంద్ర పర్యటక మంత్రి ప్రహ్లాద్ పటేల్ 'పర్యటన్ పర్వ్' కార్యక్రమాన్ని న్యూదిల్లీలో ప్రారంభించారు. ఒకసారి వాడిపారేసే ప్లాస్టిక్‌ను చారిత్రక కట్టడాల ఆవరణలో, వాటికి వంద మీటర్ల పరిధిలో అనుమతించబోమని ఈ సందర్భంగా ప్రకటించారు.

** ఎస్సీ-ఎస్టీ చట్ట నిబంధనల తీవ్రతను తగ్గించేలా గత ఏడాది మార్చిలో ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు వెనక్కి తీసుకుంది. సమానత్వం కోసం ఎస్సీ-ఎస్టీ ప్రజలు చేస్తున్న పోరాటం ఇంకా ముగిసిపోలేదని, ఇప్పటికీ అస్పృశ్యత, ఛీత్కారం, దూషణ,

సామాజిక బహిష్కరణలు కొనసాగుతూనే ఉన్నాయని జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఎం.ఆర్.షా, జస్టిస్ బి.ఆర్. గవాయ్‌ల ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలను నిరోధించే చట్టం కింద కేసు నమోదు చేయాలంటే అభియోగాలు నిజమైనవో కావో తేల్చేందుకు డీఎస్పీ స్థాయి అధికారి ద్వారా ప్రాథమిక విచారణ జరిపించాలని 2018 మార్చి 20న ద్విసభ్య ధర్మాసనం తీర్పు ఇచ్చింది. కేసు పెట్టగానే తక్షణం అరెస్టు చేయకుండా కొన్ని రక్షణలు కల్పించింది. ఈ తీర్పును తాజాగా త్రిసభ్య ధర్మాసనం ఆక్షేపించింది.

** వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారానికి 'ద కన్స్యూమర్ మొబైల్ యాప్'ను కేంద్రం న్యూదిల్లీలో ప్రారంభించింది. ఈ యాప్‌తో వినియోగదారులు తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. సులభమైన సమస్యలను 15 రోజుల్లోపు, క్లిష్టమైన ఫిర్యాదులను 60 రోజుల్లో పరిష్కరిస్తామని వినియోగదారుల మంత్రిత్వ శాఖ పేర్కొంది.

# 3.రాష్ట్రీయం

**రాష్ట్రీయం (ఆంధ్రప్రదేశ్)**

** లైటెనింగ్ రిజిలియన్స్ (పిడుగుపాటు నష్టాన్ని తగ్గించే) పురస్కారానికి ఆంధ్రప్రదేశ్ ఎంపికైంది. పిడుగుపాటుపై ముందస్తు హెచ్చరికల్లో రాష్ట్రం అనుసరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, మరణాల తగ్గింపు అంశాలను పరిగణనలోకి తీసుకుని అవార్డుకు ఎంపిక చేసినట్లు లైటెనింగ్ రిజిలియంట్ ఇండియా క్యాంపెయిన్ కన్వీనర్ సంజయ్ శ్రీవాస్తవ తెలిపారు. 'పిడుగుల నుంచి రక్షణ, భద్రత' అనే అంశంపై నవంబరు 7, 8 తేదీల్లో దిల్లీలో జరిగే సదస్సులో అవార్డు ప్రదానం చేయనున్నారు.

** వైఎస్సార్ జీవితకాల సాఫల్య పురస్కారానికి కాకినాడకు చెందిన మత్స్యకారుడు ధర్మాడి సత్యాన్ని ప్రభుత్వం ఎంపిక చేసింది. కచ్చులూరు వద్ద గోదావరిలో మునిగిన బోటును బయటకు తెచ్చిన ఆయనకు ఈ పురస్కారం అందించనున్నారు.

**రాష్ట్రీయం (తెలంగాణ)**

** కేంద్రం ప్రకటించిన స్వచ్ఛ దర్పణ్-3 ర్యాంకుల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాకు స్వచ్ఛ దర్పణ్ ర్యాంకు రావడం ఇది రెండోసారి. కేంద్ర గ్రామీణ, పట్టణాభివృద్ధి శాఖ ఏటా జాతీయస్థాయిలో ఈ ర్యాంకింగ్‌లను ప్రకటిస్తోంది.

** తెలంగాణ రాష్ట్రంలో కులాంతర వివాహాలకు ఇచ్చే ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం రూ.50వేల నుంచి రూ.2.5 లక్షలకు పెంచింది. కులవ్యవస్థ మహమ్మారిని రూపుమాపడంతో పాటు ఎస్సీలను జనజీవనంలోకి తీసుకువచ్చేందుకు ప్రోత్సాహకం పెంచినట్లు ప్రకటించింది.

**రాష్ట్రీయం (ఆంధ్రప్రదేశ్)**

** ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేలా పత్రికలు, టీవీ ఛానళ్లు నిరాధార వార్తలు ప్రచురించినా, ప్రసారం చేసినా కేసులు పెట్టాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. సామాజిక మాధ్యమాల్లో పెట్టే పోస్టులపైనా చర్యలు తీసుకోనుంది. ఆ వార్తలు, కథనాలు నిరాధారమైనవని భావిస్తే, సంబంధిత ప్రచురణకర్తలు, సంపాదకులపై కేసులు పెట్టే అధికారాన్ని ఆయా ప్రభుత్వ శాఖల కార్యదర్శులకే కట్టబెట్టింది. ఈ మేరకు సమాచార, పౌర సంబంధాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

** రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఛైర్మన్‌గా ఉమ్మడి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ఆయనతో ప్రమాణం చేయించారు. నాగార్జునరెడ్డి అయిదేళ్లు ఈ పదవిలో కొనసాగనున్నారు.

** ఆంధ్రప్రదేశ్‌లో 30 వన్‌ధన్ వికాస కేంద్రాలకు కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ అనుమతించింది. గిరిజన వ్యాపారవేత్తలను ప్రోత్సహించడం ఈ వన్‌ధన్ పథకం ఉద్దేశం.

**రాష్ట్రీయం (తెలంగాణ)**

** తెలంగాణలోని 10 జిల్లాల్లో ప్రాథమికంగా నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో 6.47 లక్షలమంది అధిక రక్తపోటు బాధితులు ఉన్నట్లు ప్రభుత్వం అంచనా వేసింది. కేంద్ర కుటుంబ సంక్షేమ శాఖ, భారతీయ వైద్య పరిశోధన మండలి, ప్రపంచ ఆరోగ్య సంస్థ, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా గత ఏడాది నవంబరు నుంచి అధిక రక్తపోటుపై సర్వే నిర్వహించాయి. రాష్ట్రంలోని 10 జిల్లాల్లో 30 ఏళ్ల పైబడినవారిలో జరిపిన ఈ సర్వే ఫలితాలతో 'ది ఇండియా హైపర్ టెన్షన్ కంట్రోల్ ఇనీషియేటివ్ (ఐహెచ్‌సీఐ) పేరుతో ఒక నివేదిక రూపొందించాయి. జనగామ జిల్లాలో అత్యధికంగా 17.21 శాతం మంది అధిక రక్తపోటు బాధితులున్నట్లు నివేదిక పేర్కొంది.

» గుండెపోటు, పక్షవాతం తదితర ప్రమాదకరమైన జీవనశైలి వ్యాధుల నివారణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ సర్వే తలపెట్టింది. తొలిదశలో తెలంగాణ, మధ్యప్రదేశ్, పంజాబ్, కేరళ, మహారాష్ట్రల్లో ఐహెచ్‌సీఐ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

** హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో అంతర్జాతీయ టీబీ, ఊపిరితిత్తుల వ్యాధుల నిరోధక సంస్థ (ఐయూఏటీబీఎల్‌డీ) ఆధ్వర్యంలో ఊపిరితిత్తుల ఆరోగ్యంపై అంతర్జాతీయ సదస్సును ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభించారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్ర వైద్య, కుటుంబ సంక్షేమ మంత్రి అశ్వనీకుమార్ చౌబే, తెలంగాణ వైద్య, కుటుంబ సంక్షేమ మంత్రి ఈటల రాజేందర్‌తోపాటు 130 దేశాలనుంచి వచ్చిన దాదాపు 400 మంది వైద్యులు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

**రాష్ట్రీయం (ఆంధ్రప్రదేశ్)**

** ప్రభుత్వ భవనాల నిర్మాణానికి 'బిల్డ్ ఏపీ' పేరుతో కొత్త పథకానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎన్‌బీసీసీ సంస్థతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టనుంది. మిషన్‌లో భాగంగా ప్రభుత్వ భూములు గుర్తించి, భవన సముదాయాలు నిర్మించాలనేది ప్రభుత్వ ఉద్దేశం. బిల్డ్ ఏపీ మిషన్ డైరక్టర్‌గా ప్రవీణ్‌కుమార్‌ను నియమించింది.

**రాష్ట్రీయం (ఆంధ్రప్రదేశ్)**

** కృష్ణా జిల్లా గన్నవరం మండలం సూరంపల్లిలో రూ.50 కోట్లతో నిర్మించిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్) నూతన ప్రాంగణాన్ని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి డి.వి. సదానంద గౌడ, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు.

**రాష్ట్రీయం (ఆంధ్రప్రదేశ్)**

** గర్భిణుల కోసం వైఎస్ఆర్ అమృతహస్తం, చిన్నారుల కోసం వైఎస్ఆర్ బాల సంజీవని పథకాలు ప్రవేశపెడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. తొలుత గిరిజన, సబ్‌ప్లాన్ ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టు అమలు చేశాక మిగతా ప్రాంతాలకు విస్తరించేలా ప్రణాళిక రూపొందిస్తారు. దీని ప్రకారం గర్భవతులు, బాలింతలకు నెలకు రూ.1062 విలువైన ఆహారపదార్థాలు లభిస్తాయి. బాల సంజీవని పథకం కింద నెలకు రూ.600 విలువైన పౌష్టికాహారాన్ని 77 గిరిజన, సబ్‌ప్లాన్ మండలాల్లోని ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు అందజేయనున్నారు.

» వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం కింద ప్రతి చేనేత కుటుంబానికి ఏటా రూ.24 వేల చొప్పున ఆర్థిక సాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించింది. డిసెంబరు 31 నుంచి ఈ పథకం అమలు చేయనున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న చేనేత కార్మికులు ఈ పథకానికి అర్హులు. 75,243 మంది దీని ద్వారా లబ్ధి పొందుతారని అంచనా.

**రాష్ట్రీయం (తెలంగాణ)**

** మానవ అక్రమ రవాణా, పని ప్రదేశాల్లో మహిళలను వేధించడంపై నమోదైన కేసులపరంగా 2017 సంవత్సరానికి తెలంగాణ ప్రథమ స్థానంలో ఉంది. అక్టోబరు 20న విడుదలైన జాతీయ నేర గణాంకాల మండలి (ఎన్‌సీఆర్‌బీ) - 2017 నివేదిక ఈ అంశాలను వెల్లడించింది. ఆహార కల్తీల్లో 95 శాతానికిపైగా తెలుగు రాష్ట్రాల్లోనే నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా 2,588 కేసులు నమోదైతే అందులో తెలంగాణలో అత్యధికంగా 2,009, ఆంధ్రప్రదేశ్‌లో 456 కేసులు ఉన్నాయి.

** క్యూఎస్ ఇండియా యూనివర్సిటీస్ ర్యాంకింగ్ - 2020లో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) 8వ స్థానంలో నిలిచింది. ఈ సంస్థ విద్యాపరమైన గుర్తింపు, ఆచార్యుల ప్రతిభ, అధ్యాపక-విద్యార్థి నిష్పత్తి, పీహెచ్‌డీలు లాంటి 8 అంశాలను కొలమానంగా తీసుకుని దేశంలోని వర్సిటీలపై సర్వే నిర్వహించింది. 100 ర్యాంకులతో ప్రకటించిన ఈ జాబితాలో ఐఐటీ బొంబాయి మొదటిస్థానంలో ఉంది.

**రాష్ట్రీయం (ఆంధ్రప్రదేశ్)**

** క్యూఎస్ ఇండియా యూనివర్సిటీస్ ర్యాంకింగ్ - 2020లో ఆంధ్రప్రదేశ్ నుంచి అయిదు వర్సిటీలకు చోటు దక్కింది. శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ (44), ఆంధ్ర విశ్వవిద్యాలయం (47), శ్రీకృష్ణదేవరాయ (66-70 మధ్య), జేఎన్‌టీయూ అనంతపురం (71-75), కేఎల్ యూనివర్సిటీ (81-85).

** మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించడం, వారిపై దాడులు లాంటి నేరాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే తొలిస్థానంలో నిలిచింది. జాతీయ నేర గణాంక సంస్థ తాజాగా విడుదల చేసిన 2017 సంవత్సర నేర నివేదిక ఈ అంశాలను వెల్లడించింది. అత్యధిక నేరాలు జరిగిన రాష్ట్రాల్లో ఏపీ పదోస్థానంలో నిలిచింది.

**రాష్ట్రీయం (ఆంధ్రప్రదేశ్)**

** ట్యాక్సీ డ్రైవర్లకు ఆర్థిక సాయం అందించేందుకు ఉద్దేశించిన 'వైఎస్ఆర్ వాహనమిత్ర' పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో అక్టోబరు 4న ప్రారంభించారు. ఈ పథకం కింద ట్యాక్సీ డ్రైవర్లకు రూ.10 వేలు అందిస్తారు.

**రాష్ట్రీయం (ఆంధ్రప్రదేశ్)**

** ఆంధ్రప్రదేశ్‌లో 1,254 గ్రామ, వార్డు సచివాలయాలు ప్రారంభమయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో 1138, పట్టణాల్లో 116 సచివాలయాలు అందుబాటులోకి వచ్చాయి. మండలానికి, పురపాలక సంఘానికి ఒకటి చొప్పున మొదటి విడతగా వీటిని ప్రారంభించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తూర్పు గోదావరి జిల్లా కరపలో గ్రామ సచివాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

**రాష్ట్రీయం (తెలంగాణ)**

** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించిన 'స్వచ్ఛతా దివస్' కార్యక్రమంలో పెద్దపల్లి జిలా కలెక్టర్ శ్రీదేవసేన స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ - 2019 పురస్కారాన్ని ప్రధాని మోదీ చేతుల మీదుగా అందుకున్నారు. దేశంలో 690 జిల్లాల్లోని 17,400 గ్రామాలు స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో పాల్గొన్నాయి. జాతీయ స్థాయిలో పెద్దపల్లి జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది.

**రాష్ట్రీయం (ఆంధ్రప్రదేశ్)**

** ఆంధ్రప్రదేశ్ రుణభారం 2020 మార్చి నాటికి రూ.3.41 లక్షల కోట్లకు చేరనుంది. ఏటా సగటున రూ.17 వేల కోట్లకు పైచిలుకు చొప్పున వచ్చే అయిదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ.89,994 కోట్ల రుణాలు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులపై భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి.

**రాష్ట్రీయం (తెలంగాణ)**

** తెలంగాణ అప్పులు 2020 మార్చి నాటికి రూ.1,68,724 కోట్లకు చేరనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన రాష్ట్రాల ఆర్థిక గణాంకాల్లో వెల్లడైంది. ఇందులో అంతర్గత రుణాల వాటా రూ.1.40 లక్షల కోట్లు. 2019 మార్చి నాటికి తెలంగాణ అప్పులు

రూ.1,44,590 కోట్లుగా నమోదయ్యాయి. దేశంలో విద్యారంగంపై అతి తక్కువ ఖర్చు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ. ఈ రంగంపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టే ఖర్చు అయిదేళ్లలో తగ్గుతూ వస్తోంది. 2014-15లో 11.2% ఖర్చు చేయగా, తర్వాతి సంవత్సరాల్లో అది 10.9%, 10%, 10.4%, 7.9%కి చేరి 2019-20 నాటికి 6.6 శాతానికి తగ్గింది.

** జాతిపిత మహాత్మాగాంధీ జయంతి రోజైన అక్టోబరు 2ను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

** జల్‌శక్తి అభియాన్ కింద నీటి సంరక్షణలో తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా 76.14 పాయింట్లతో దేశంలో మూడోస్థానంలో నిలిచింది. అన్ని కేటగిరీల్లో మెరుగైన ఫలితాలు సాధించిన ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ కడప జిల్లా 82.16 పాయింట్లతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. భూమిలో తేమ శాతాన్ని పెంచాలనే ఉద్దేశంతో జల్‌శక్తి అభియాన్ కింద దేశంలో ఎంపిక చేసిన 253 జిల్లాల్లో జులై 1 నుంచి సెప్టెంబరు 30 వరకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేసింది.

SmartPrep.in

# 4.ఆర్థిక రంగం

** చిన్నవయసులోనే ప్రపంచంలో అత్యంత సంపన్నుడిగా పేరుగాంచిన జెఫ్ బెజోస్ ప్రస్తుతం రెండోస్థానానికి పడిపోయారు. తాజాగా అమెజాన్ షేరు పడిపోవడంతో ఆయన సంపద 103.9 బిలియన్ డాలర్లకు చేరుకుంది. 105.7 బిలియన్ డాలర్ల సంపదతో బిల్‌గేట్స్ మళ్లీ మొదటి స్థానానికి చేరుకున్నారు.

** సులభంగా వ్యాపార నిర్వహణకు వీలున్న దేశాల్లో భారత్ 63వ స్థానంలో నిలిచింది. ప్రపంచ బ్యాంక్ తన 'డూయింగ్ బిజినెస్ - 2020' నివేదికలో ఈ విషయాన్ని పేర్కొంది. వరుసగా మూడో ఏడాది మెరుగైన పనితీరు ప్రదర్శించిన దేశాల్లో భారత్ టాప్-10లో చోటు దక్కించుకుంది. ప్రపంచ బ్యాంక్ గత ఏడాది మొత్తం 190 దేశాలకు ర్యాంకింగ్‌లు ఇవ్వగా మన దేశం 77వ స్థానంలో నిలిచింది. తాజాగా 63వ ర్యాంకును చేరుకుంది.

» 2019 మే 1తో ముగిసిన 12 నెలల కాలానికి మొత్తం 190 దేశాల్లో 10 వ్యాపార కార్యకలాపాల అమలు తీరును పరిగణనలోకి తీసుకుని తాజా నివేదిక రూపొందించారు. సులభతర వాణిజ్యంలో న్యూజిలాండ్ తొలిస్థానంలో నిలిచింది. సింగపూర్ (2), హాంకాంగ్ (3), డెన్మార్క్ (4), కొరియా (5), అమెరికా (6) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వరుసగా అయిదోసారి రెపో రేటును తగ్గించింది. ప్రస్తుతం 5.40 శాతంగా ఉన్న రెపో రేటును పావుశాతం తగ్గించి 5.15 శాతంగా నిర్ణయించింది. రివర్స్ రెపోరేటును 4.90 శాతం, బ్యాంక్ రేటును 5.40 శాతంగా నిర్ణయించారు. 2019-20 ఆర్థిక సంవత్సరం జీడీపీని 6.9 శాతం నుంచి 6.1 శాతానికి, 2020-21 సంవత్సరానికి జీడీపి అంచనాను 7.2కు సవరించారు. అక్టోబరు 4న ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ అధ్యక్షతన జరిగిన పరపతి విధాన కమిటీ సమీక్షా సమావేశంలో ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

** వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు గత నెలలో రూ.91,916 కోట్లుగా నమోదయ్యాయి. ఇది 19 నెలల కనిష్ఠం. 2019 ఆగస్టులో జీఎస్‌టీ వసూళ్లు రూ.98,202 కోట్లు వసూలయ్యాయి.

# 5.నియామకాలు

** భారత తదుపరి ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బోబ్డేను నియమిస్తూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు న్యాయ మంత్రిత్వశాఖ నుంచి నియామక ప్రకటన వెలువడింది. ప్రస్తుత సీజేఐ జస్టిస్ రంజన్ గొగొయ్ నవంబరు 17న పదవీ విరమణ చేయనున్నారు. నవంబరు 18న జస్టిస్ బోబ్డే బాధ్యతలు స్వీకరిస్తారు. అయోధ్యపై విచారణ జరుపుతున్న కీలక రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ బోబ్డే ఒకరు. ఆయన పూర్తి పేరు - జస్టిస్ శరద్ అర్వింద్ బోబ్డే. 1956 ఏప్రిల్ 24న మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో జన్మించారు.

** కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) ఛైర్మన్‌గా ఆర్.కె. జైన్ నియమితులయ్యారు. జైన్ ప్రస్తుతం గోదావరి నది యాజమాన్య బోర్డు ఛైర్మన్‌గా, పోలవరం ప్రాజెక్ట్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా (సీఈవో) ఉన్నారు. ఇప్పటి వరకు సీడబ్ల్యూసీ ఛైర్మన్‌గా ఉన్న ఎ.కె. సిన్హా అక్టోబరు 31న పదవీ విరమణ చేయనున్నారు. ఆ స్థానంలో బాధ్యతలు చేపట్టే జైన్ 2020 డిసెంబరు వరకు ఆ పదవిలో కొనసాగుతారు. జైన్ స్థానంలో గోదావరి నది యాజమాన్య బోర్డు ఛైర్మన్‌గా చంద్రశేఖర్ అయ్యర్ నియమితులయ్యారు. పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సీఈవోగా కూడా ఆయనే బాధ్యతలు నిర్వహించనున్నారు.

** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తొలి పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరిని నియమిస్తూ కేంద్ర న్యాయశాఖ అక్టోబరు 3న నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం మధ్యప్రదేశ్ హైకోర్టులో సీనియర్ న్యాయమూర్తిగా పని చేస్తున్న మహేశ్వరిని ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం ఆగస్టు 22న సిఫారసు చేసింది. ఈయన నియామకానికి రాజ్యాంగంలోని 217(1) అధికరణం ప్రకారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదం తెలపడంతో కేంద్రం ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 2019 జనవరి 1 నుంచి అమరావతి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ జస్టిస్ సి. ప్రవీణ్‌కుమార్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు.

** పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మేనేజింగ్ డైరెక్టర్, సీఈవోగా తెలుగు వ్యక్తి సీహెచ్ ఎస్ఎస్ మల్లికార్జునరావు నియమితులయ్యారు. ఈ పదవిలో మల్లికార్జునరావును నియమించాలని ఆర్థిక సేవల డిపార్ట్‌మెంట్ చేసిన ప్రతిపాదనకు అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ ది క్యాబినెట్ (ఏసీసీ) ఆమోదం తెలిపింది. ఆయన 2021 సెప్టెంబరు 18 వరకు పదవిలో కొనసాగుతారు. ప్రస్తుతం ఆయన అలహాబాద్ బ్యాంక్ ఎండీ, సీఈఓగా వ్యవహరిస్తున్నారు.

# 6.అవార్డులు

** ఇండియన్ ఎగ్జిబిషన్ ఇండస్ట్రీ అసోసియేషన్ అధ్యక్షుడు, హైటెక్స్ సీఓఓ కేవీ నాగేంద్ర ప్రసాద్‌కు ప్రతిష్ఠాత్మక 'బాబ్ డాల్‌మేయర్ ఎడ్యుకేటర్ ఆఫ్ ది ఇయర్' పురస్కారం లభించింది. అమెరికాకు చెందిన ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఎగ్జిబిషన్స్ అండ్ ఈవెంట్స్ (ఐఏఈఈ) డిసెంబరులో లాస్‌వేగాస్‌లో జరిగే వార్షిక సమావేశంలో ఆయనకీ పురస్కారాన్ని అందించనుంది.

** క్రీడలు, వ్యాపారం, ఆరోగ్య సంరక్షణ, కళలు, సాహిత్యం లాంటి రంగాల్లో విశేష సేవలందించిన వ్యక్తులకు ఇచ్చే 'మగుదం అవార్డు' 2019 సంవత్సరానికి రామ్‌రాజ్ కాటన్స్ ఛైర్మన్ కె.ఆర్.నాగరాజన్‌కు లభించింది. చెన్నైలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆయనకీ అవార్డును ప్రదానం చేశారు.

** పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంచడంతోపాటు స్వచ్ఛతా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నందుకు ప్రముఖ క్రికెటర్ సచిన్ తెందుల్కర్‌కు 'అత్యంత ప్రభావశీల స్వచ్ఛతా రాయబారి' అవార్డు లభించింది. మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా దిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈ పురస్కారాన్ని సచిన్‌కు ప్రదానం చేశారు.

# 7.వార్తల్లో వ్యక్తులు

** పర్యావరణ ప్రేమికురాలు గ్రెటా థెన్‌బర్గ్ 84 దేశాలు సభ్యులుగా ఉన్న 'నోర్డియాక్ కౌన్సిల్' ప్రకటించిన 'ఎన్విరాన్‌మెంటల్ అవార్డు'ను తిరస్కరించింది. ఆమె తన నిర్ణయాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రకటించింది. ఈ అవార్డు కింద దాదాపు రూ.36 లక్షల నగదు బహుమతి అందిస్తారు. స్వీడన్‌కు చెందిన 16 ఏళ్ల గ్రెటా థెన్‌బర్గ్ కొన్నేళ్లుగా పర్యావరణ పరిరక్షణ కోసం పోరాటం చేస్తోంది. గతేడాది ఆ దేశ పార్లమెంట్ ఎదుట ఒంటరిగా ధర్నాకు దిగి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఇటీవల ఐక్యరాజ్యసమితి వేదికగా జరిగిన సదస్సులో పర్యావరణ మార్పులపై అశ్రద్ధ వహిస్తున్నారంటూ ప్రపంచ నేతలను నిలదీసి వార్తల్లో నిలిచింది.

** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నూతన అధ్యక్షుడిగా సౌరభ్ గంగూలీ బాధ్యతలు స్వీకరించారు. ముంబయిలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో గంగూలీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సుప్రీంకోర్టు నియమించిన పాలకుల కమిటీ (33 నెలలపాటు) బీసీసీఐ బాధ్యతలను ఇప్పటి వరకూ నిర్వర్తించింది. గంగూలీ బీసీసీఐకి 39వ అధ్యక్షుడు. లోధా కమిటీ నిబంధనల ప్రకారం పది నెలలపాటు ఆయన ఈ పదవిలో ఉంటారు.

** ఇంగ్లండ్‌కు చెందిన తొమ్మిదేళ్ల దివ్యాంగ బాలిక డైసీ-మే ప్రతిష్ఠాత్మక పారిస్ ఫ్యాషన్ వీక్ 2019లో పాల్గొంది. బ్రిటన్‌లోని బర్మింగ్‌హామ్‌కు చెందిన డైసీ ఎముకల్లో లోపాల కారణంగా 18 నెలల వయసులోనే రెండు కాళ్లను కోల్పోయింది. అయినా ఆత్మవిశ్వాసంతో పిల్లల ఫ్యాషన్ రంగంలోకి అడుగుపెట్టి అందరినీ ఆకట్టుకుంటోంది.

## 8.వార్తల్లో ప్రదేశాలు

** ప్రపంచ నగరాల దినోత్సవం సందర్భంగా అక్టోబరు 31న యునెస్కో మన దేశంలోని హైదరాబాద్, ముంబయి నగరాలను సృజనాత్మక నగరాల జాబితాలో కొత్తగా చేర్చింది. ప్రపంచవ్యాప్తంగా వేర్వేరు అంశాలకు సంబంధించి 66 నగరాలను యునెస్కో ఎంపిక చేసింది. సంగీతం, లలిత కళలు, జానపద కళలు, సినిమా, సాహిత్యం, డిజిటల్ ఆర్ట్స్, పాకనైపుణ్యం (గాస్ట్రానమీ) కేంద్రంగా అభివృద్ధి చెందే నగరాలను యునెస్కో క్రియేటివ్ సిటీస్ జాబితాలో చేరుస్తూ ఉంటుంది. హైదరాబాద్ ఆహార (గ్యాస్ట్రానమీ) విభాగంలో సృజనాత్మక నగరంగా నిలిచింది. సినిమా విభాగంలో ముంబయికి చోటు దక్కింది.

** ఫిలిప్పీన్స్‌లోని మిరియం కళాశాలలో సెంటర్ ఫర్ పీస్ ఎడ్యుకేషన్ వద్ద ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆ దేశ పర్యటనలో ఉన్న భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆవిష్కరించారు.

** నైలు నదికి పశ్చిమ తీరాన ఈజిప్ట్‌లోని అసాసిఫ్ అనే ప్రాంతంలో పురావస్తు శాఖ జరిపిన తవ్వకాల్లో 3 వేల ఏళ్లనాటి శవపేటికలు బయటపడ్డాయి. ఈ ప్రాంతంలో శవపేటికలు బయటపడటం ఇదే తొలిసారని ప్రభుత్వం ప్రకటించింది.

** హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో ఎకో టూరిజం పేరుతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు కొత్తగూడ బొటానికల్ గార్డెన్‌కు ఐఎస్ఓ 9001-2015 సర్టిఫికెట్ లభించింది. ఒక పార్కుకు ఈ అంతర్జాతీయ గుర్తింపు లభించడం దేశంలో ఇదే తొలిసారి.

** మహాత్ముడి 150వ జయంతి వేడుకల నేపథ్యంలో నోయిడాలోని సెక్టార్ - 94లో ప్లాస్టిక్ వ్యర్థాలతో ఏర్పాటు చేసిన భారీ చరఖాను కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖా మంత్రి స్మృతీ ఇరానీ ప్రారంభించారు. 1250 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించి దీన్ని రూపొందించారు.

## 9. సదస్సులు - సమావేశాలు

** అజర్‌బైజాన్‌లోని బాకులో జరిగిన 18వ అలీనోద్యమ దేశాల సదస్సులో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొన్నారు.

** అలీనోద్యమ (నామ్) దేశాల 18వ శిఖరాగ్ర సదస్సు అజర్‌బైజాన్‌లో అక్టోబరు 25న జరగనుంది. భారత ప్రతినిధి బృందానికి ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు నేతృత్వం వహించనున్నారు.

## 10.క్రీడలు

** టోక్యో ఒలింపిక్ బాక్సింగ్ టెస్టు ఈవెంట్లో శివ థాపా (63 కేజీలు), పూజ రాణి (75 కేజీలు) స్వర్ణాలు సాధించారు. ఫైనల్లో శివ 5-0తో సానాటలి టోల్తయేవ్ (కజకిస్థాన్)ను చిత్తు చేశాడు. పూజ 4-1తో కైట్‌లిన్ పార్కర్ (ఆస్ట్రేలియా)ను ఓడించి పసిడి గెలుచుకుంది.

** 2020 టోక్యో ఒలింపిక్స్ బాక్సింగ్ అథ్లెట్ల సుహృద్భావ రాయబారిగా భారత దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ ఎంపికైంది. వివిధ ఖండాల నుంచి 10 మంది సభ్యుల బృందాన్ని అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం ఎంపిక చేసింది. వీరిలో ఆసియాకు మేరీ ప్రతినిధిగా వ్యవహరించనుంది. ఈ 10 మంది సభ్యుల్లో ఉక్రెయిన్ స్టార్ లమాచెంకో (ఐరోపా) లాంటి బాక్సర్లు ఉన్నారు.

** వర్ధమాన మహిళల ఆసియా కప్ క్రికెట్ టోర్నమెంట్లో భారత్ విజేతగా నిలిచింది. డక్‌వర్త్/లూయిస్ పద్ధతిలో ఫలితాన్ని నిర్ధారించిన ఈ మ్యాచ్‌లో భారత జట్టు ఆతిథ్య శ్రీలంకపై విజయం సాధించింది. మొదట భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 175 పరుగులు చేసింది. అనంతరం వర్షం కారణంగా లక్ష్యాన్ని 149 పరుగులకు సవరించగా లంక 34.3 ఓవర్లలో 135 పరుగులకే ఆలౌటైంది.

** బుడాపెస్ట్‌లో ప్రపంచ అండర్-23 రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన రవీందర్ సింగ్ రజతం గెలుచుకున్నాడు. ఫైనల్లో అతడు ఉలుబెక్ జొల్దొష్బెకోవ్ (కిర్గిజ్‌స్థాన్) చేతిలో ఓడిపోయాడు. ప్రస్తుత టోర్నీలో అతడి రజతమే భారత్‌కు తొలి పతకం. మొత్తంగా ప్రపంచ అండర్-23 రెజ్లింగ్‌లో పతకం గెలిచిన అయిదో భారత రెజ్లర్ రవీందర్.

** ఫ్రెంచ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన భారత డబుల్స్ క్రీడాకారులు సాత్విక్ సాయిరాజ్- చిరాగ్‌శెట్టి జోడీ తాజాగా ప్రకటించిన బీడబ్ల్యూఎఫ్ ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు మెరుగుపరచుకుని 9వ ర్యాంకు సాధించింది. ఆగస్టులో థాయ్‌లాండ్ ఓపెన్ టైటిల్ సాధించిన సాత్విక్- చిరాగ్ జోడీ కెరియర్‌లో అత్యుత్తమంగా 9వ ర్యాంకు కైవసం చేసుకుంది. అనంతరం 11వ ర్యాంకుకు పడిపోయింది. తాజాగా 9వ స్థానానికి చేరుకుంది. మహిళల సింగిల్స్‌లో పి.వి.సింధు 6వ, సైనా నెహ్వాల్ 9వ, పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 10వ, సాయిప్రణీత్ 11వ ర్యాంకుల్లో కొనసాగుతున్నారు.

** బంగ్లాదేశ్ టెస్టు, టీ20 సారథి షకిబ్ అల్ హసన్ అంతర్జాతీయ క్రికెట్ ఆడకుండా ఐసీసీ రెండేళ్ల నిషేధం విధించింది. ఐసీసీ అవినీతి నిరోధ విభాగం నమోదు చేసిన అభియోగాలను షకిబ్ అంగీకరించాడు. అతడిపై ఒక ఏడాది పూర్తి నిషేధం, మరో ఏడాది సస్పెన్షన్ ఉంటాయని ఐసీసీ వెల్లడించింది. రెండు సందర్భాలలో బుకీలు తనను సంప్రదించిన విషయాన్ని ఐసీసీకి వెల్లడించడంలో షకిబ్ విఫలమవడంతో ఈ నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది ఐపీఎల్, ఆస్ట్రేలియాలో జరిగే టీ20 ప్రపంచకప్‌లో అతడు పాల్గొనలేడు.

** బాసెల్‌లో జరిగిన స్విస్ ఇండోర్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను రోజర్ ఫెదరర్ గెలుచుకున్నాడు. ఫైనల్లో ఆస్ట్రేలియా క్రీడాకారుడు అలెక్స్ డి మినార్‌పై విజయం సాధించాడు. తాజా గెలుపుతో తన కెరియర్‌లో మొత్తం 103 సింగిల్స్ సాధించిన క్రీడాకారుడిగా ఫెదరర్ నిలిచాడు. అతడికి ఈ సీజన్‌లో ఇది నాలుగో టైటిల్. ఇంతకుముందు దుబాయ్, మియామి, హాలె టైటిల్స్ దక్కించుకున్నాడు.

** పారిస్‌లో జరుగుతున్న ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల డబుల్స్ విభాగం ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టిల జోడీ రన్నరప్‌గా నిలిచి రజతం గెలుచుకున్నారు. అక్టోబరు 27న జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ప్రపంచ నంబర్‌వన్ జోడీ, ఇండోనేసియాకు చెందిన మార్కస్ ఫెర్నాల్డి, కెవిన్ సంజయ సుకముల్జో చేతిలో ఓటమిపాలయ్యారు. 1983లో చివరిసారి భారత పురుషుల డబుల్స్ జోడీ పార్థో గంగూలీ, విక్రమ్‌సింగ్ ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ గెలిచారు. ఆ తర్వాత 2017లో కిదాంబి శ్రీకాంత్ పురుషుల సింగిల్స్ విభాగంలో టైటిల్ సొంతం చేసుకున్నాడు.

** చైనాలోని వుహాన్‌లో జరుగుతున్న ప్రపంచ మిలటరీ క్రీడల్లో భారత క్రీడాకారులు రెండు పతకాలు సాధించారు. పురుషుల బాక్సింగ్ 49 కేజీల విభాగంలో దీపక్ రజతం గెలుచుకున్నాడు. పురుషుల టెన్నిస్ సింగిల్స్ విభాగంలో శ్రీరామ్ బాలాజీ కాంస్యం సాధించాడు.

** పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, మహిళా క్రికెటర్ స్మృతి మంధాన ఈ ఏడాది విజ్డెన్ ఇండియా ఉత్తమ క్రికెటర్ అవార్డుకు ఎంపికయ్యారు. మిథాలీరాజ్, దీప్తి శర్మ తర్వాత విజ్డెన్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్న భారత మూడో మహిళా క్రికెటర్‌గా స్మృతి నిలిచింది.

** దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీని కర్ణాటక జట్టు దక్కించుకుంది. ఫైనల్లో వీజేడీ పద్ధతిలో తమిళనాడుపై విజయం సాధించింది. ఈ టోర్నీలో కర్ణాటక విజేతగా నిలవడం ఇది నాలుగోసారి. గతంలో 2013, 2014, 2017 సీజన్లలో ఆ జట్టు గెలిచింది.

** షాంఘైలో జరుగుతున్న ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత వుషూ క్రీడాకారుడు ప్రవీణ్ కుమార్ స్వర్ణం గెలిచి ఆ ఘనత సాధించిన తొలి భారత క్రీడాకారుడిగా నిలిచాడు. సాండా (48 కేజీలు) విభాగం ఫైనల్లో ప్రవీణ్ ఫిలిప్పీన్స్‌కు చెందిన రసెల్ డియాజ్‌పై విజయం సాధించాడు. పురుషుల 60 కేజీల విభాగంలో విక్రాంత్ బలియాన్ కాంస్యం గెలుచుకున్నాడు. మహిళల్లో పూనమ్ (75 కేజీలు), సనాతోయ్ దేవి (52 కేజీలు) చెరో రజతం నెగ్గారు.

** దక్షిణాఫ్రికాతో మూడు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను భారత జట్టు 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. రాంచీలో ముగిసిన మూడో టెస్ట్‌లో 202 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన భారత్ ఐసీసీ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో తన అగ్రస్థానాన్ని (240 పాయింట్లు) బలోపేతం చేసుకుంది. కెప్టెన్‌గా విరాట్ కోహ్లీకి ఇది 11వ సిరీస్ విజయం. స్వదేశంలో భారత్‌కు ఇది వరసగా 11వ సిరీస్. దక్షిణాఫ్రికాతో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడం భారత జట్టుకు ఇదే తొలిసారి. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు రెండూ రోహిత్ శర్మకే లభించాయి.

** చైనాలోని వుహాన్‌లో జరుగుతున్న ప్రపంచ మిలిటరీ క్రీడల్లో దివ్యాంగ స్ప్రింటర్ ఆనందన్ గుణశేఖరన్ రెండు పసిడి పతకాలు సాధించాడు. దివ్యాంగ పురుషుల 100 మీ., 400 మీటర్ల ఐటీ1 విభాగాల్లో అతడీ స్వర్ణాలు గెలుచుకున్నాడు.

** పారిస్‌లో ప్రారంభమైన ఫ్రెంచ్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో భారత క్రీడాకారిణి పీవీ సింధు కెనడాకు చెందిన మిచెల్ లీపై ఇజయం సాధించింది.

** డగ్లస్‌లో జరిగిన ఫిడే గ్రాండ్ స్విస్ చెస్ టోర్నీ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ట్రోఫీ గెలుచుకుంది.

** నాగ్‌పుర్‌కు చెందిన రౌనక్ సిధ్వాని భారత 65వ గ్రాండ్ మాస్టర్‌గా గుర్తింపు పొందాడు. ఐల్ ఆఫ్ మ్యాన్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో సాధించిన విజయంతో అతడికి గ్రాండ్ మాస్టర్ హోదా ఖాయమైంది. పిన్న వయసులో (13 ఏళ్ల 9 నెలల 28 రోజులు) జీఎం హోదా పొందిన ఏడో ఆటగాడిగా, భారత్ నుంచి ఈ ఘనత సాధించిన మూడో వ్యక్తిగా రౌనక్ నిలిచాడు. ప్రపంచ చెస్‌లో చిన్న వయసులో జీఎం హోదా పొందిన ఆటగాడి రికార్డు సెర్గీ కర్జాకిన్ (రష్యా, 12 ఏళ్ల 7 నెలలు) పేరిట ఉంది?

** రాంచీలో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడో టెస్టులో భారత్ తన తొలి ఇన్నింగ్స్‌ను 9 వికెట్లకు 497 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఓపెనర్ రోహిత్ శర్మ టెస్ట్ కెరియర్‌లో తొలి డబుల్ సెంచరీ నమోదు చేశాడు. సచిన్, సెహ్వాగ్, క్రిస్‌గేల్ తర్వాత టెస్టులు, వన్డేల్లోనూ డబుల్ సెంచరీ సాధించిన నాలుగో బ్యాట్స్‌మెన్ రోహిత్.

** ప్రో కబడ్డీ లీగ్ ఏడో సీజన్ విజేతగా బంగాల్ వారియర్స్ జట్టు నిలిచింది. అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్లో దబంగ్ దిల్లీ జట్టును ఓడించి తొలిసారి పీకేఎల్ ట్రోఫీని గెలుచుకుంది.

** జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ యువకుడు రాగాల వరుణ్ స్వర్ణం గెలుచుకున్నాడు. బిహార్‌లో అక్టోబరు 19న జరిగిన జూనియర్ పురుషుల 73 కేజీల విభాగంలో అతడు అగ్రస్థానంలో నిలిచాడు.

** దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడో టెస్టులో భారత ఓపెనర్ రోహిత్ శర్మ 117 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. సునీల్ గావస్కర్ తర్వాత ఒకే సిరీస్‌లో 3 సెంచరీలు చేసిన రెండో భారత ఓపెనర్‌గా గుర్తింపు పొందాడు. ఒకే సిరీస్‌లో అత్యధిక సిక్సర్లు (17) సాధించిన ఘనత కూడా దక్కించుకున్నాడు.

** భారత చదరంగ క్రీడాకారిణి కోనేరు హంపి ఫిడే తాజా ర్యాంకింగ్స్‌లో మూడోస్థానంలో నిలిచింది. రష్యాలో ఇటీవల నిర్వహించిన ఫిడే మహిళల గ్రాండ్ ప్రిలో విజేతగా నిలవడంతో ఆమె ర్యాంక్ మెరుగైంది.

** ఆస్ట్రేలియా క్రికెటర్ అలీసా హీలీ మహిళల టీ20 క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన క్రికెటర్‌గా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. సిడ్నీలో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఆమె 61 బంతుల్లోనే 148 పరుగులు సాధించింది.

** దోహాలో జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో 200 మీటర్ల పరుగులో అమెరికాకు చెందిన నోవా లైల్స్ ఛాంపియన్‌గా నిలిచాడు.

** మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) అధ్యక్షుడిగా శ్రీలంక మాజీ కెప్టెన్ కుమార సంగక్కర బాధ్యతలు చేపట్టాడు. ఎంసీసీ అధ్యక్ష పదవికి ఎంపికైన తొలి బ్రిటీషేతర వ్యక్తి సంగక్కర. ఈ పదవిలో ఏడాదిపాటు కొనసాగుతాడు.

## 11.మరణాలు

** ప్రముఖ సినీ నటి గీతాంజలి హైదరాబాద్‌లో మరణించారు. 1947లో తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జన్మించిన ఆమె బహుభాషా నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఎన్టీఆర్ నటించిన సీతారాముల కల్యాణం చిత్రంలో సీత పాత్రలో అందరినీ ఆకట్టుకున్నారు. పలు చిత్రాల్లో తనతోపాటు నటించిన సీనియర్ నటుడు రామకృష్ణను వివాహం చేసుకున్నారు. కలవారి కోడలు, డాక్టర్ చక్రవర్తి, లేతమనసులు, బొబ్బిలియుద్ధం, ఇల్లాలు, దేవత, గూఢచారి116, కాలం మారింది, శ్రీ శ్రీ మర్యాదరామన్న, నిర్దోషి, మాయాజాలం, గ్రీకువీరుడు తదితర 500 పైగా చిత్రాల్లో నటించారు.

** సీపీఐ సీనియర్ నాయకుడు గురుదాస్ దాస్‌గుప్తా (83) కోల్‌కతాలో కన్నుమూశారు. గుప్తా 25ఏళ్ల పాటు పార్లమెంటేరియన్‌గా ఉన్నారు. 2004లో బెంగాల్‌లోని పాంక్‌సుడా నియోజకవర్గం నుంచి, 2009లో ఘూటాల్ నుంచి ఆయన లోక్‌సభ ఎంపీగా ఎన్నికయ్యారు. అంతకుముందు 1985, 1988, 1994లో రాజ్యసభకు ఎంపికయ్యారు. 2009 నుంచి సీపీఐ తరపున లోక్‌సభా పక్ష నేతగా వ్యవహరించారు. 2001లో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 'సెక్యూరిటీస్ స్కాండల్-ఏ రిపోర్ట్ టు ది నేషన్' అనే పుస్తకం రచించారు.

** ప్రముఖ పాత్రికేయులు, విశాలాంధ్ర మాజీ ఎడిటర్ చక్రవర్తుల రాఘవాచారి హైదరాబాద్‌లో మరణించారు. 1939 సెప్టెంబరు 10న వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాతాపురంలో ఆయన జన్మించారు. 1972లో విశాలాంధ్ర సంపాదకుడిగా బాధ్యతలు స్వీకరించి, మూడు దశాబ్దాలు కొనసాగారు.

** పద్మశ్రీ పురస్కార గ్రహీత, యోగా శిక్షకురాలు నానమ్మాళ్ (99) వృద్ధాప్యం కారణంగా కోయంబత్తూరులో మరణించారు. కేంద్ర ప్రభుత్వం 2018లో ఈమెను పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. రాష్ట్రపతి చేతుల మీదుగా మహిళా శక్తి బిరుదు అందుకున్నారు.

** జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) మాజీ సంచాలకులు డా.సి.గోపాలన్ (101) చెన్నైలో మరణించారు. వైద్య, పోషకాహార రంగాల్లో అనేక పరిశోధనలు చేసిన ఆయన 1961-74 వకు ఎన్ఐఎన్ సంచాలకుడిగా, 1974-79 వరకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్‌గా పని చేశారు. ప్రభుత్వం 1970లో పద్మశ్రీ, 2003లో పద్మభూషణ్ అవార్డులతో ఆయన్ను సత్కరించింది.

# 12.సైన్స్ అండ్ టెక్నాలజీ

** వైద్య పరీక్ష యంత్రాలను ఉత్పత్తి చేసే ట్రాన్సాసియా బయోమెడికల్స్ క్షయ వ్యాధిని కచ్చితంగా గుర్తించేందుకు అధునాతన ఎంఎక్స్16 పరికరాన్ని భారతీయ మార్కెట్లో ఆవిష్కరించింది. ఈ పరికరాన్ని ట్రాన్సాసియా-ఎర్బా ఇంటర్నేషనల్‌కు యూకేలో ఉన్న ఎర్బా మాలిక్యులర్ అభివృద్ధి చేసింది. హైదరాబాద్‌లో ఊపిరితిత్తుల ఆరోగ్యం, క్షయ వ్యాధిపై జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో దీన్ని విడుదల చేశారు. ఇప్పటివరకు క్షయ వ్యాధిని గుర్తించే పరీక్షకు రూ.4,000 వరకూ ఖర్చవుతుండగా, ఎంఎక్స్16 పరికరంతో దాదాపు రూ.1,000 మాత్రమే అవుతుందని రూపకర్తలు పేర్కొన్నారు.

** అమెరికా పరిశోధకులు కణజాలాన్ని 5 సెకన్లలో అతికించగల సరికొత్త టేపును తయారుచేశారు. పెద్ద శస్త్రచికిత్సల్లో వేసే కుట్ల వల్ల కోతకు గురైన కణజాలం తీవ్ర ఒత్తిడికి గురవుతూ ఇన్ఫెక్షన్లకు, నొప్పికి, చెరిగిపోని గీతలకు దారితీస్తోంది. ఈ సమస్యల నుంచి ఉపశమనం కలిగించేలా శాస్త్రవేత్తలు 'తడిగా ఉండే కణజాలాన్ని' చిటికెలో అతికించే టేపును సృష్టించారు. గుండె తదితర అవయవాల్లో పరికరాలను అమర్చడానికి కూడా ఇది బాగా ఉపయోగపడుతుందని వారు తెలిపారు. మంచు, వర్షాలు కురిసే సమయంలో సాలె పురుగులు వల నుంచి క్రిమికీటకాలు జారిపోకుండా ప్రత్యేక జిగురుతో గూడును అల్లుతాయి. ఈ స్ఫూర్తితోనే ప్రత్యేక రకమైన జిగురు పదార్థంతో టేపును సృష్టించామని పరిశోధనకర్త జుయాన్‌హె జావో పేర్కొన్నారు.

** పది నిమిషాల ఛార్జింగ్‌తో ఏకంగా 200 మైళ్ల పాటు విద్యుత్ వాహనాన్ని నడిపించే సరికొత్త బ్యాటరీ డిజైన్‌ను అమెరికా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. విద్యుత్ వాహనాలకు సంబంధించి వేగంగా ఛార్జింగ్ కీలకమైన అంశం. పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాలతో పోటీపడాలంటే ఇది చాలా అవసరం. టెస్లా కంపెనీ ఉత్పత్తి చేస్తున్న కొత్త తరం విద్యుత్ కార్లకు పాక్షికంగా ఛార్జి కావడానికి కూడా అరగంట పడుతోంది. ఈ నేపథ్యంలో పది నిమిషాలు ఛార్జి చేస్తే 200 మైళ్లు పయనించే వాహనంపై అమెరికాలోని పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు దృష్టిసారించారు. అయితే ఇంత వేగంగా ఛార్జి చేయాలంటే అంత సమయంలో 400 కిలోవాట్ల మేర శక్తిని గ్రహించాల్సి ఉంటుంది. ప్రస్తుత బ్యాటరీలకు ఈ సామర్థ్యం లేదు. దీన్ని అధిగమించడానికి శాస్త్రవేత్తలు ఛార్జింగ్ సమయంలో తమ ప్రయోగాత్మక బ్యాటరీలో ఉష్ణోగ్రతను 60 డిగ్రీల సెల్సియస్‌కు పెంచారు. అనంతరం ఈ శక్తిని వినియోగించే సమయంలో ఆ వేడిని తగ్గించారు. వేగంగా ఛార్జి చేసే సమయంలో తలెత్తే ఉష్ణోగ్రత వల్ల ఎక్కువ నష్టం జరగకుండా ఈ విధానం నిలువరిస్తుంది.

** పర్యావరణ ప్రేమికురాలు గ్రెటా థెన్‌బర్గ్ 84 దేశాలు సభ్యులుగా ఉన్న 'నోర్డియాక్ కౌన్సిల్' ప్రకటించిన 'ఎన్విరాన్‌మెంటల్ అవార్డు'ను తిరస్కరించింది. ఆమె తన నిర్ణయాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రకటించింది. ఈ అవార్డు కింద దాదాపు రూ.36 లక్షల

నగదు బహుమతి అందిస్తారు. స్వీడన్‌కు చెందిన 16 ఏళ్ల గ్రెటా థెన్‌బర్గ్ కొన్నేళ్లుగా పర్యావరణ పరిరక్షణ కోసం పోరాటం చేస్తోంది. గతేడాది ఆ దేశ పార్లమెంట్ ఎదుట ఒంటరిగా ధర్నాకు దిగి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఇటీవల ఐక్యరాజ్యసమితి వేదికగా జరిగిన సదస్సులో పర్యావరణ మార్పులపై అశ్రద్ధ వహిస్తున్నారంటూ ప్రపంచ నేతలను నిలదీసి వార్తల్లో నిలిచింది.

** హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఐటీ ఆచార్యుల బృందం భారతీయులకు ఉపయోగపడేలా మెదడు అట్లాస్ (బ్రెయిన్ అట్లాస్)ను తయారు చేసింది. ఎంఆర్ఐ స్కానింగ్ వంటివి తీసే సమయంలో ఇది ఎంతో ఉపయోగపడనుంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వినియోగిస్తున్న బ్రెయిన్ అట్లాస్‌ను 60 ఏళ్ల ఫ్రెంచ్ మహిళ మెదడు ఆధారంగా టలరైక్ అండ్ టౌర్నోక్స్ తయారు చేశారు. 1993లో మెట్రెయిల్ న్యూరోలాజికల్ ఇన్‌స్టిట్యూట్ (ఎంఎన్ఐ), ఇంటర్నేషనల్ కన్సార్టియం ఫర్ బ్రెయిన్ మ్యాపింగ్ (ఐసీబీఎం) సంయుక్తంగా డిజిటల్ అట్లాస్‌ను రూపొందించాయి. అనంతరం వివిధ రకాల మెదడు అట్లాస్‌లను న్యూరోసైన్స్ అధ్యయనాల కోసం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇవన్నీ పాశ్చాత్య దేశీయుల మెదడు నమూనా ఆధారంగా తయారైనవి కావడంతో భారతీయులతో పోల్చినప్పుడు తేడాలు కనిపిస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ట్రిపుల్‌ఐటీకి చెందిన విజువల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కేంద్రం ప్రొ.జయంతి శివస్వామి నేతృత్వంలోని బృందం, తిరువనంతపురంలోని శ్రీచిత్ర తిరునాళ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీలోని రేడియాలజీ విభాగం భారతీయుల కోసం ప్రత్యేకంగా మెదడు అట్లాస్‌ను తయారు చేశాయి. 50 అంశాలను దృష్టిలో ఉంచుకుని దేశంలోని మూడు ప్రాంతాలకు చెందిన ప్రజల మెదడు స్కానింగ్ నివేదికలు తెప్పించి ఐబీఏ-100 పేరిట అధ్యయనం చేశారు. 20-30 ఏళ్ల మధ్య యువతీయువకులకు సంబంధించి మెదడు స్కాన్స్ తీసుకుని అట్లాస్ రూపొందించారు.

** స్పెయిన్ శాస్త్రవేత్తలు ప్రపంచంలోనే అత్యంత దృఢమైన సరికొత్త పదార్థాన్ని సృష్టించారు. దీన్ని చాలా చవకగా తయారు చేయవచ్చు. ప్రకృతిలో బోరాన్, కార్బైడ్‌లు ఉచితంగా లభిస్తాయి. వీటికి కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. ఈ రెండింటినీ మేళవిస్తే గట్టి పదార్థాన్ని సృష్టించవచ్చు. తాజాగా యూనివర్సిటీ ఆఫ్ సెవిలె శాస్త్రవేత్తలు... లేజర్ రేడియేషన్ ద్వారా ఈ బోరాన్ కార్బైడ్‌ను సమ్మిళితం చేసి, గట్టి పరచడంలో విజయం సాధించారు. వజ్రం దృఢత్వం 45 గిగాపాస్కల్స్ (జీపీఏ), బిగుతు 1050 జీపీఏ ఉంటుంది. ఈ సరికొత్త పదార్థం గట్టిదనం 52 జీపీఏ, బిగుతు 600 జీపీఏ ఉన్నట్టు పరిశోధకులు లెక్కగట్టారు. ఆల్ట్రా నిరోధక సామర్థ్యం, రేడియో యాక్టివిటీ ఉండటం దీని ప్రత్యేకతలు. భవిష్యత్తులో కార్లు, విమానాలు తదితర రవాణా వాహనాల తయారీలో ఇది సరికొత్త అధ్యాయం సృష్టిస్తుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

** అన్ని రకాల ఫ్లూ వైరస్‌లను నిరోధించడానికి అమెరికా శాస్త్రవేత్తలు 1జీ01 అనే కొత్త యాంటీ బయాటిక్‌ను కనుక్కున్నారు. ఈ పరిశోధనల సాయంతో భవిష్యత్‌లో అన్ని రకాల ఫ్లూ వైరస్‌లకు ఒకే మందు తయారు చేస్తామని వారు వెల్లడించారు.

** 1008 మంది జన్యుక్రమాలను పూర్తి స్థాయిలో ఆవిష్కరించడం ద్వారా దేశంలో జన్యు చికిత్సలకు మార్గం సుగమం అయ్యిందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక వ్యవహారాల శాఖ మంత్రి హర్షవర్ధన్ తెలిపారు. ఒక జన్యుపటంలోని డీఎన్ఏ న్యూక్లియోటైడ్‌లు లేదా మూల జతల క్రమాన్ని గుర్తించడాన్ని జన్యుక్రమ ఆవిష్కరణగా పేర్కొంటారు. 'ఇండిజెన్' పేరుతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో దేశం నలుమూలల నుంచి 1008 మందిని ఎంచుకున్నారు. జనాభాలో మొత్తం 55 ఉప తరగతుల వారు ఇందులో ఉండేలా చూశారు. 2019 ఏప్రిల్‌లో పారిశ్రామిక, శాస్త్ర పరిశోధన మండలి (సీఎస్ఐఆర్) నేతృత్వంలో ఈ ప్రాజెక్ట్ ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని సీసీఎంబీ, దిల్లీలోని ఐజీఐబీ సంస్థలు పాల్గొన్నాయి.

** బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్ వర్సిటీ శాస్త్రవేత్తలు సూర్యకాంతిని ఉపయోగించుకుంటూ పర్యావరణ అనుకూల పద్ధతిలో ఇంధనాన్ని ఉత్పత్తి చేసే కృత్రిమ ఆకును అభివృద్ధి చేశారు. ఈ సాధనం సిన్‌గ్యాస్ వాయువును నేరుగా ఉత్పత్తి చేయగలదు. ప్రస్తుతం హైడ్రోజన్, కార్బన్ మోనాక్సైడ్ మిశ్రమంతో దీన్ని తయారు చేస్తున్నారు. సిన్‌గ్యాస్ ఉత్పత్తిలో శిలాజ ఇంధనాలను ఉపయోగించడం వల్ల వాతావరణంలోకి హానికారక కార్బన్ డై ఆక్సైడ్ విడుదలవుతోంది. దీనికి పరిష్కారంగానే బ్రిటన్ శాస్త్రవేత్తలు కృత్రిమ ఆకును రూపొందించారు.

** అమెరికా, ఆస్ట్రేలియాలకు చెందిన ఖగోళ శాస్త్రవేత్తలకు విశ్వం ఆవిర్భవించిన తొలినాళ్ల నుంచి ఉన్న గెలాక్సీని గుర్తించారు. యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్, స్విన్‌బర్న్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన జరిపారు. చిలీలోని పర్వతాలపై ఉన్న 66 రేడియో టెలిస్కోప్ సమూహాన్ని (ఆల్మా) దీనికి ఉపయోగించారు.

** గూగుల్ సంస్థ అత్యాధునిక 'సికమోర్ చిప్'ను అభివృద్ధి చేసింది. ప్రపంచంలో అత్యంత వేగవంతమైన సూపర్ కంప్యూటర్ 10 వేల ఏళ్లలో పూర్తి చేసే గణనను ఈ క్వాంటమ్ కంప్యూటింగ్ చిప్ కేవలం 200 సెకన్లలో పూర్తి చేసినట్లు ప్రకటించింది. ఈ ఆవిష్కరణను గూగుల్ 'క్వాంటమ్ సుప్రిమసీ'గా పేర్కొంది. దీనికి సంబంధించిన వివరాలు నేచర్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

** రెండు సీట్లు ఉన్న ఎగిరే ట్యాక్సీని సింగ్‌పూర్ గగన వీధుల్లో ప్రయోగాత్మకంగా నడిపి చూశారు. జర్మనీకి చెందిన వోల్‌కాప్టర్ దీన్ని అభివృద్ధి చేసింది. వాహనాల రద్దీని తగ్గించేందుకు ఎగిరే ట్యాక్సీలు తోడ్పడతాయని భావిస్తున్నారు.

** ఇజ్రాయెల్‌లో పీహెచ్‌డీ చేస్తున్న భారత పరిశోధకురాలు అంగికా బుల్‌బుల్ కొత్త టెలిస్కోపిక్ కెమెరాను అభివృద్ధి చేశారు. పాలప్యాకెట్ల పరిమాణంలో ఉండే చిన్న చిన్న ఉపగ్రహాలను గుండ్రటి నిర్మాణంలో అమర్చి, టెలిస్కోప్ లెన్స్ సహాయంతో ఈ కెమెరాను రూపొందించారు. దీని సాయంతో అతి తక్కువ ఖర్చుతో అంతరిక్షంలోని ఫొటోలను తీయవచ్చని ఆమె తెలిపారు.

** సుమారు 300 కోట్ల సంవత్సరాల కిందట అంగారక (మార్స్) గ్రహంపై ఉప్పు నీటి సరస్సులు ఉండేవని అమెరికాలోని టెక్సాస్ ఏఎండ్ ఎం యూనివర్సిటీ పరిశోధకుల అధ్యయనంలో తేలింది. మార్స్‌పై ఉన్న గేల్ క్రేటర్ ప్రాంతంలో 300 కోట్ల ఏళ్ల కిందట ఏర్పడిన సరస్సు ఆ గ్రహ వాతావరణం కారణంగా ఎండిపోయిందని వారు పేర్కొన్నారు. నాసా పంపిన క్యూరియాసిటీ రోవర్‌తో 2012 నుంచి దీనిపై అన్వేషణ జరుగుతోందని తెలిపారు.

** భారత తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎస్ఏ బోబ్డే పేరును ప్రతిపాదిస్తూ ప్రస్తుత చీఫ్ జస్టిస్ రంజన్ గొగొయ్ కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖకు లేఖ రాశారు. గొగొయ్ 2018 అక్టోబరు 3న భారతదేశ 46వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన నవంబరు 17న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో సీనియారిటీ ప్రకారం బోబ్డే పేరును సిఫారసు చేశారు.

** ఖండాలను దాటి లక్ష్యాలను ఛేదించగల ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి 'మైన్యూట్‌మ్యాన్ 3'ని అమెరికా మిలిటరీ విజయవంతంగా ప్రయోగించింది. ఆయుధరహితమైన ఈ క్షిపణిని కాలిఫోర్నియా నుంచి పసిఫిక్ సముద్రం మీదుగా మార్షల్ ద్వీపాల్లోని క్వాజాలైన్ అటోల్‌కు ప్రయోగించారు.ఈ క్షిపణి 6,750 కిలోమీటర్లు ప్రయాణించిందని ఎయిర్‌ఫోర్స్ గ్లోబల్ స్ట్రైక్ వెల్లడించింది.